# ఏక్ దం న్యూస్
సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | తెలంగాణ | సంపుటి : 02 | సంచిక 021 | పేజీలు 03



**విలేకరులు కావలెను**

తక్కువ సమయంలోనే ప్రజల ఆదరణ పొందుతున్న **ఏక్ దం న్యూస్** తెలుగు దినపత్రికకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్, నియోజకవర్గ ఇన్చార్జ్, మండల రిపోర్టర్స్ కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును

8790055545



## క్యాడర్ ను సిద్ధం చేస్తున్న రేవంత్




**ఏక్‌దం న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 23:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థలకు రెడీ అవుతున్నారు. నేతలను అందుకు సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్, బీజేపీలను చావుదెబ్బ తీసి సత్తా చాటాలనుకుంటున్నారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే కాకుండా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలన్న ఆలోచనతో రేవంత్ రెడ్డి ఉన్నారు. అందుకోసం అస్త్రశస్త్రాలను రేవంత్ సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా పథకాలను అందిచి ప్రజల్లోకి వాటిని బలంగా తీసుకు వెళ్లే ప్రయత్నాలను ప్రారంభించారు. అందుకోసమే రేవంత్ రెడ్డి ఈరోజు కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ప్రధాన లక్ష్యం స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగడంపైనే చర్చ సాగుతుంది. తెలంగాణకు కొత్త పీసీసీ అధ్యక్షుడు కూడా రావడంతో అన్ని రకాలుగా ముందుకు వెళ్లి పార్టీని బలోపేతం చేయాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అందుకోసమే ప్రత్యేకంగా సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నేతలకు నియోజకవర్గాలుగా బాధ్యతలను అప్పగించి అక్కడి ప్రధాన సమస్యలపై రానున్న కాలంలో దృష్టి పెట్టి నోటిఫికేషన్ కు ముందే ప్రజల మనసులను గెలిచే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో స్థానిక సంస్థల్లో విజయం సాధించాలన్న లక్ష్యాన్ని నేతల ముందు రేవంత్ రెడ్డి ఉంచనున్నట్లు తెలిసింది. దీంతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ను మరింత నిర్వీర్యం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకున్నారు. ఒకవైపు ప్రతిపక్షాలను బలహీనపరుస్తూనే మరొక వైపు మరిన్ని పథకాలను వీలయినంత త్వరగా అమలు చేయాలన్న నిర్ణయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చినట్లు తెలిసింది. ఇందుకోసం రోడ్డు మ్యాప్ ను నేడు సిద్ధం చేయనున్నారని తెలిసింది. ఇప్పటికే అమలు చేసిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మరిన్ని వాగ్దానాలు చేయడమే కాకుండా మిగిలిపోయిన రైతు భరోసా, మహాలక్ష్మి పథకంలో కొన్నింటిని అమలు చేయడంపై నేటి సమావేశంలో చర్చించనున్నారని తెలిసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా రైతు రుణమాఫీ చేశామని, అయితే ఇది రైతుల్లోకి బలంగా వెళ్లలేకపోయిందన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేకుండా ప్రకటనలు చేయడం ప్రత్యర్థి పార్టీలు విమర్శలు చేయడానికి ఊతమిచ్చినట్లయిందని ఆయన అభిప్రాయపడుతున్నారు. అందుకోసమే అందరూ సమన్వయంతో ఒకే మాట మీద ఉండాలని, రైతు రుణమాఫీ అంశంపై కొందరు తప్ప అందరూ మాట్లాడకపోవడమే మంచిదన్న అభిప్రాయంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. మొత్తం మీద నేడు జరుగుతున్న సమావేశంలో నేతలకు రేవంత్ రెడ్డి అన్ని విషయాలపై కూలంకషంగా దిశానిర్దేశం చేయనున్నారని సమాచారం.

## గ్రేటర్ కరీంనగర్ దిశగా అడుగులు

**ఏక్‌దం న్యూస్, కరీంనగర్, సెప్టెంబర్ 23**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కార్పొరేషన్ గా మారనున్నది. కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మరో ఆరు పంచాయతీలను కార్పొరేషన్ లో విలీనం చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 18 ఏళ్ల క్రితం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ గా మారిన కరీంనగర్ నగర పాలక సంస్థ మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో అడుగు ముందుకు వేస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రేటర్ కరీంనగర్ గా మార్చేందుకు సన్నాహాలు చేస్తుంది. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు మరో ఆరు గ్రామాలను కార్పొరేషన్ పరిధిలో విలీనం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ కు సూచించారు.ఈ ప్రక్రియ పూర్తయితే త్వరలోనే గ్రేటర్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పడటం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరానికి ఆనుకొని ఉన్న కొన్ని గ్రామాలను గతంలో మినహాయించడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన క్రమంలో మంత్రి పొన్నం ఈసారి వివాదాలకు తావు లేకుండా రెండు మండలాల నుంచి గ్రామాలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు కోరడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.నాలుగున్నర ఏళ్ల క్రితమే కొత్తపల్లి మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. తాజాగా గ్రేటర్ కరీంనగర్ ప్రక్రియలో భాగంగా కొత్తపల్లి మున్సిపాలిటీని కూడా విలీనం చేయాలని నిర్ణయించారని తెలుస్తోంది. కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని చింతకుంట, లక్షిపూర్, మల్కాపూర్ గ్రామాలు, కరీంనగర్ రూరల్ పరిధిలోని బొమ్మకల్, దుర్శేడు, గోపాల్ పూర్ గ్రామాలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరిన వెంటనే వాటికి ఆమోదం లభించడంతో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ గా మారడం ఖాయమనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.2005లో మున్సిపాలిటీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ గా ఎదిగిన కరీంనగర్ నగరం గడిచిన రెండు దశాబ్దాల్లో శరవేగంగా విస్తరించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాలన్నీ కూడా నగరంతో సమానంగా కలిసిపోయాయి. మౌలిక వసతులు లేక నగరాన్ని అనుకొని ఉన్న గ్రామాలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతుండటంతో గత ప్రభుత్వం 2020లో పరిసర పరిధిలోని ఎనిమిది గ్రామాలను కార్పొరేషన్ లో విలీనం చేసింది. 3.50 లక్షల ఓటర్లు, సుమారు ఐదు






లక్షల జనాభా కలిగి ఉన్న నగరంగా ఎదిగిన కరీంనగర్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్ సిటీ పథకం కింద ఎంపిక కావడంతో సుమారు వేయి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో మరింత ప్రగతి సాధించింది.అయితే గతంలో జరిగిన విలీనం సమయంలో జరిగిన కొన్ని పొరపాట్లు, హైకోర్టు సూచనలు పరిగణనలోకి తీసుకొని పెండింగ్ లో పెట్టిన గ్రామాలను కార్పొరేషన్ పరిధిలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ కు పలువురు కాంగ్రెస్ నేతలు విన్నవిస్తూ వచ్చారు. అన్ని అర్హతలు ఉన్నా కూడా విలీనం చేయకపోవడంతో కనీస మౌళిక వసతులకు దూరమవుతున్నామంటూ దృష్టికి తీసుకురాగా మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు నగరానికి 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలను కార్పొరేషన్ లో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ను కోరారు.2015లో 50 డివిజన్లు ఉండగా.. 2020లో పలు గ్రామాల విలీనం తర్వాత డివిజన్ల సంఖ్య 60కి పెరిగింది. తాజాగా ఒక మున్సిపాలిటీ, అరు గ్రామాలను కూడా విలీనం చేయడం ద్వారా. డివిజన్ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలో 10 వేల వరకు ఓటర్లు ఉండగా.. బొమ్మకల్ జనాభా 12 వేల వరకు ఓటర్లు ఉన్నారు. చింతకుంట పరిధిలో 8100 మంది ఓటర్లు, మల్కాపూర్, లక్షిపూర్ పరిధిలో 4036 మంది ఓటర్లు, గోపాల్ పూర్ పరిధిలో 2633 మంది ఓటర్లు, దుర్శేడు పరిధిలో 3341 మంది ఓటర్లు ఉన్నారని తేలింది. 2020 జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో 2.72 లక్షల మంది ఓటర్లు కార్పొరేషన్ పరిధిలో ఉండగా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగి 3.50 లక్షల వరకు చేరింది. తాజాగా మరో 30 వేల పైచిలుకు ఓటర్లు నగర పరిధిలో చేరనుండటంతో డివిజన్ల సంఖ్య .. డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా కూడా మార్పులుచేర్పులు జరిగే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుత డివిజన్ల హద్దులు కూడా మారడం ఖాయమని తెలుస్తోంది. గతంలోనే డివిజన్ల స్వరూపంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఈసారైనా అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించకపోతే మరోమారు అభాసుపాలు కావడం ఖాయమని తెలుస్తోంది.మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గ్రేటర్ కరీంనగర్ గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయనే ప్రచారంతో నగర ప్రజలు స్వాగతిస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు మంత్రిగా ఉన్న ఎమ్మెస్సార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్లే మునిసిపాలిటీ నుంచి కరీంనగర్ కార్పొరేషన్ స్థాయికి ఎదిగిందని, నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తీసుకోవడంతో గ్రేటర్ కరీంనగర్ గా మారబోతుందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.గతంలో నగరంతో పూర్తిగా కలిసిపోయినా కూడా బొమ్మకల్ గ్రామాన్ని విలీనం నుంచి మినహాయించడం వల్ల తీవ్ర విమర్శలు వచ్చాయని, మల్కాపూర్, చింతకుంట, లక్షిపూర్ ప్రజలు కూడా విలీనానికి సిద్ధంగా ఉన్నా గతంలోనే పెండింగ్ పెట్టారని అందుకే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చి గ్రేటర్ కరీంనగర్ ను మరింత అభివృద్ధిపరచాలని తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన స్వాగతిస్తున్నామని పలువురు కార్పొరేటర్ లు అభిప్రాయపడుతున్నారు.కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామ పంచాయితీలను మున్సిపాలిటీని కరీంనగర్లో విలీనం చేయడం మంచిదే అంటున్నారు ప్రస్తుతం నగర పాలక సంస్థ పాలకవర్గం బిఆర్ఎస్ కు చెందిన నాయకులు. ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల విలీనం తర్వాత, ఆ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు ఇవ్వకపోవడంతో విలీన ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని అభిప్రాయపడుతున్నారు.ప్రధానంగా తాగు నీరు సరఫరా, రోడ్లు, మురికి కాల్వల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడం తో విలీనం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతుందంటున్నారు. 1985 సంవత్సరంలో నగరంలో విలీనం అయిన రాంపూర్, రాంనగర్ ప్రాంతాల్లో ఇంకా సమగ్ర అభివృద్ధి జరగలేదని ప్రస్తావిస్తు అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని కోరుతున్నారు.

## ఇప్పుడు కాకపోతే ఎప్పుడు కేసీఆర్ వ్యూహాత్మక మౌనంపై చర్చ



**ఏక్‌దం న్యూస్, మెదక్, సెప్టెంబర్ 23,**
కేసీఆర్ నోటి నుంచి వచ్చే మాటలు తూటాల్లా పేలుతాయి. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తాయి. అచ్చమైన తెలంగాణ మాండలికంతో చేసే కామెంట్స్ ముచ్చెమటలు పట్టిస్తాయి. అన్నింటికీ మించి తెలంగాణ ప్రజలకు నచ్చుతాయి. కానీ ఆ మాటలు వినబడి దాదాపు ఐదు నెలలు కావస్తోంది. ఆయన కనిపించడం లేదు. ఆయన మాట వినిపించడం లేదు. కారణం ఏంటి? కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని భావిస్తున్నారా? లేకుంటే వ్యూహాత్మకమా? ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ లో ఇదే ఆసక్తికరమైన చర్చ.తెలంగాణ రాకముందు ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో కేసీఆర్ తన ప్రసంగాలతో రాష్ట్ర ప్రజానీకాన్ని ఆకట్టుకోగలిగారు. ఆయన సభలో మాట్లాడబోతున్నారంటే అందరూ టీవీల ముందు కూర్చునే పరిస్థితి ఉండేది. అలా.. ఉద్యమం చేసే చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టగలిగారు. ఇక రాష్ట్రం ఏర్పాటు నుంచి దశాబ్దకాలం పాటు ఆయన పార్టీకి తిరుగులేకుండా పోయింది. ఏ ఎన్నిక వచ్చినా కూడా గులాబీ జెండానే రెపరెపలాడింది. అటు.. ప్రభుత్వంలోనూ తిరుగులేని నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగారు. దశాబ్ద కాలం పాటు అటు పార్టీలోనూ.. ఇటు ప్రభుత్వంలోనూ ఆయన చెప్పిందే నడిచింది.దశాబ్ద కాలం పాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన కేసీఆర్.. మొన్నటి ఎన్నికల్లో అనూహ్యంగా పదవి కోల్పోవాల్సి వచ్చింది. దాంతో అప్పటి నుంచి ఆయన ప్రజల్లోకి వచ్చిన దాఖలాలు లేవు. ఆయనకు సంబంధించిన ఫామ్‌హౌజ్‌లోనే కాలం గడుపుతున్నారు. నేతలతో సమీక్షలైనా.. ఎవరైనా కలవాలన్నా.. అంతా అక్కడే. అంతే తప్పితే ఇంతవరకు బయట కనిపించ లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా కూడా ఒకటే చర్చ జరుగుతోంది. కేసీఆర్ మళ్లీ ఎప్పుడు ప్రజల్లోకి వస్తారా..? అని. అయితే.. రాజకీయ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్.. ఇలా ప్రజల్లోకి రాకుండా ఉండిపోవడం పైనా పలు కారణాలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇదంతా ఆయన రాజకీయ చతురతలో భాగమేనని ఆయన అభిమానులు అంటున్నారు.మరోవైపు.. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు కావస్తోంది. ఇచ్చిన హామీలను

## హైడ్రా.... ప్లస్ అవుతుందా... మైనస్ అవుతుందా






**ఏక్‌దం న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 23:**
హైదరాబాద్ మహానగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెరువులను, కుంటలను, నాలాలను, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసింది. దీనికి సీనియర్ ఐపీఎస్ రంగనాథ్‌ను కమిషనర్‌గా నియమించింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మించిన వారి గుండెల్లో హైడ్రా దడ పుట్టిస్తోంది. హైడ్రా వ్యవస్థ ఏర్పాటు నుంచే దూకుడుగా వెళ్తోంది. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. ఇప్పటివరకు అలా.. వందలాది నిర్మాణాలను కూల్చివేయగా.. ప్రభుత్వానికి వెయ్యి ఎకరాలకు పైగా భూమిని రికవరీ చేశారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరినీ ఒకే తీరులో చూస్తే అక్రమ కట్టడాలు కనిపిస్తే వాటిని కూల్చుతూ ముందుకు సాగుతోంది.ఇప్పటివరకు ఎలాంటి సిబ్బంది, ఎలాంటి అధికారాలు లేనప్పటికీ హైడ్రా ఓ స్థాయిలో దూసుకుపోయింది. తాజాగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హైడ్రాకు మరింత బలాన్ని చేకూర్చింది. నిన్నటి కేబినెట్‌లో హైడ్రాకు అడిషనల్ పవర్స్ ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దాంతో ఇప్పటికే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్న హైడ్రా.. కేబినెట్ నిర్ణయంతో తన దూకుడును మరింత పెంచనుంది. ఇప్పుడు దానికి విస్తృత అధికారాలతో పాటు చట్టబద్ధతను కూడా ఇచ్చారు. చెరువులతోపాటు గ్రేటర్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించే వరకూ హైడ్రాకు విశేష అధికారాలు అలానే ఉంటాయని కేబినెట్ స్పష్టం చేసింది. అయితే.. కేబినెట్‌లో మరో నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు లోపల 27 అర్బన్, లోకల్ బాడీలకు విస్తరించింది. 51 గ్రామపంచాయతీలను కూడా కోర్ అర్బన్‌లో విలీనం చేస్తూ నిర్ణయం తీసకున్నారు. అలాగే.. ఇప్పటివరకు కేవలం ఒక్క కమిషనర్ రంగనాథ్ మాత్రమే అన్నీతానై ఇదంతా నడిపించారు. కానీ.. తాజాగా ప్రభుత్వం అదనంగా సిబ్బందిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి హైడ్రా ఆపరేషన్స్ కోసం 150 మంది అధికారులతోపాటు 964 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కేటాయించారు.ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. హైడ్రా ఏర్పాటు నుంచి రేవంత్ రెడ్డి సర్కార్ పలు విమర్శలు, పలు ప్రశంసలు ఎదుర్కొంటోంది. హైడ్రా ఆపరేషన్స్ బాగుందని చాలా వరకు వినిపిస్తుండగా.. మరికొంత మంది నుంచి మాత్రం పేదల కడుపు కొట్టడానికే హైడ్రా తెచ్చారనే విమర్శలు వచ్చాయి. అయితే.. చాలా జిల్లాల నుంచి కూడా హైడ్రాను తమ జిల్లాల్లోనూ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. అటు పొరుగు రాష్ట్రమైన ఏపీ నేతల నుంచి కూడా హైడ్రా పై ప్రశంసలు వచ్చాయి. అందులోభాగంగానే తాజాగా.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు విశేషాధికారాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే.. ఈ నిర్ణయంతో రేవంత్ రెడ్డి సర్కారుకు ప్లస్ కానుందా..? మైనస్ కానుందా..? అనే చర్చ సైతం జోరుగా నడుస్తోంది. పొలిటికల్ లీడర్లు హైడ్రాను ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తున్నారు. అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ సైతం హైడ్రాపై అసంతృప్తితోనే ఉన్నాయి. పర్మిషన్లు తీసుకున్న వారి ఇళ్లను ఎలా కూల్చివేస్తారంటే నిలదీస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ముందు ముందు హైడ్రా పనితీరు ఇంకా ఎలా ఉండబోతోంది..? వచ్చిన అధికారాలను ఎలా వినియోగించుకోబోతోందో అని ఆసక్తి నెలకొంది.

ఎవరేమనుకున్నా...

హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అస్సెట్స్ ఏర్పాటుతో చెరువులు, నాలాలు, కుంటలు ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను ఇప్పటికే అనేకమైన వాటిని కూల్చివేసింది. అయితే ఇంకా వందకు పైగా ఫిర్యాదులు హైడ్రా వద్ద ఉన్నాయి. ముఖ్యమైన భవనాలను నిర్మించి అక్కడ వ్యాపారాలు, విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఆసుపత్రులు కూడా నిర్వహిస్తుండటంతో వాటిని కూడా కూల్చాలని రేవంత్ రెడ్డి హైడ్రా అధికారులను ఆదేశించారు. 169 మంది అదనపు సిబ్బందిని హైడ్రాకు కేటాయించడం వెనక కూడా రానున్న కాలంలో హైదరాబాద్ నగరంలో కూల్చివేతలు మరింతగా ఉంటాయాన్న సంకేతాలు పంపినట్లయింది. అసెంబ్లీ సమావేశాల్లో కూడా హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ ను తెచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే అనేక కూల్చివేతలను చేపట్టి యాభై ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న హైడ్రా రానున్న కాలంలో మరింత స్పీడ్ పెంచే విధంగా అడుగులు వేయనున్నట్లు అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రాజకీయ నేతల ఆక్రమణలను కూల్చివేతలను త్వరలో ప్రారంభిస్తారని తెలిసింది. విద్యాసంస్థలను మాత్రం ఏ ఏడాది వేసవి సెలవుల్లో కూల్చివేతలను చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. మధ్యలో అయితే విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడి విద్యాసంవత్సరం నష్టపోయే అవకాశముందని, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేక వస్తుందని భావించి కొంత వెనకడుగు వేసింది. ఈ లోపు న్యాయస్థానంలో వేసిన కేసుల విషయంలోనూ హైడ్రా కొంత సమాచారం ఇచ్చి క్లియర్ చేసుకోవాలని భావిస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా ఉండటంతో కొంత విరామమిచ్చిన హైడ్రా చట్టపరంగా అన్ని క్లియర్ చేసుకున్న తర్వాతనే ముందుకు వెళ్లాలని రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే న్యాయపరమైన చిక్కులు తొలగించేందుకు న్యాయనిపుణులతో హైడ్రా అధికారులు చర్చిస్తున్నారు


An evaluation version of novaPDF was used to create this PDF file.
Purchase a license to generate PDF files without this notice.

## ఇప్పుడు కాకపోతే ఎప్పుడు కేసీఆర్ వ్యూహాత్మక మౌనంపై చర్చ

ఆ పార్టీ అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు చాలా సందర్భాల్లో ఆరోపిస్తూ వచ్చారు. రైతులకు ఇచ్చిన హామీలను సగం వరకే తీర్చారని, ప్రజల హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని అంటున్నారు. అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపైనా ఇంతవరకు కేసీఆర్ మాట్లాడలేదు. ముందు నుంచీ సైలెంటుగానే ఉండిపోయారు. రైతుబంధు, రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిదంటూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినా.. కేసీఆర్ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. సీనియర్ నేతగా, ముఖ్యమంత్రిగా చేసిన అనుభవంతో తమ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినప్పటికీ కేసీఆర్ మౌనంగానే ఉండిపోయారు.కాంగ్రెస్ కొలువుదీరినప్పటి నుంచి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకొస్తోంది. వాటిని మీద విచారణలు నడుస్తున్నాయి. ఆ విచారణ పూర్తయ్యే వరకు ఇలా సైలెంటుగా ఉండిపోవడమే మంచిదని ఆయన భావిస్తున్నారా..? అనే టాక్ సైతం నడుస్తోంది. ఇప్పటికే కాళేశ్వరంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ రిటైర్డు జస్టిస్‌తో విచారణ చేపట్టింది. అలాగే జీఎస్టీ స్కామ్ పైనా విచారణ జరుగుతోంది. ఇంకా గొర్రెల స్కీమ్‌పైనా ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మరో మంత్రి.. మిషన్ భగీరథలోనూ రూ.20వేల కోట్ల అక్రమాలు జరిగాయంటూ ఆరోపించారు. అయితే.. ఎంతసేపూ ప్రభుత్వం బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలని ప్రయత్నిస్తున్న తరుణంలో వాటికి దీటైన బదులివ్వాలని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లోనే ఉండి వ్యూహరచన చేస్తున్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతారని అంటున్నారు. మరోవైపు.. ఆయన రాకకోసం కింది స్థాయి కార్యకర్తల నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు అంతా కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. అలాగే.. పార్టీలకతీతంగా ఉన్న అభిమానులు సైతం ఆయన తొరగా బయటకు రావాలని ఆకాంక్షిస్తున్నారు. పెద్దాయన రావాలి.. మళ్లీ పార్టీకి ఊపు తీసుకురావాలని కోరుతున్నారు.

# వెలుగులోకి కాళేశ్వరం అక్రమాలు

**ఏక్‌దం న్యూస్, కరీంనగర్, సెప్టెంబర్ 23**

బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో రూ.3 లక్షల కోట్ల తాగు, సాగు నీటి ప్రాజెక్ట్స్‌కు ప్లానింగ్ జరిగింది. వీటిలో ఎక్కువ ప్రాజెక్టుల కాంట్రాక్టులు మేఘా సంస్థకే దక్కాయి. అయితే, ప్రభుత్వ ఇంజినీర్లతో కుమ్మక్కయి అంచనాల పెంపులో కుట్రలు జరిగాయనేది ప్రధాన ఆరోపణ. దీని స్కెచ్ అంతా మేఘా సంస్థలోనే గీశారు. గతంలో ఈఎన్సీగా పని చేసి, తర్వాత మేఘా కంపెనీలో చేరిన వెంకట రామారావు ఇందులో కీలక పాత్ర పోషించాడు. ఆనాడు ఏం జరిగింది? డిజైన్లలో మార్పులు ఎలా జరిగాయి? అంచనాల పెంపు వెనుక దాగిన రాహస్యాలు ఏంటి? ఇలా అనేక డౌట్స్‌తో ప్రభుత్వ ఇంజినీర్లపై ఇప్పుడు ప్రశ్నల వర్షం కురిపిస్తోంది పీసీ ఘోష్ కమిషన్. కాళేశ్వరంలో జరిగిన అవకతవకలపై నిజానిజాలు రాబడుతోంది. కానీ, అధికారులు దాటవేత ధోరణిలో ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది.కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ కొనసాగుతోంది. తాజాగా క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు విచారణకు హాజరవ్వగా, వారిని ప్రశ్నించింది కమిషన్. మూడు బ్యారేజీలలో క్వాలిటీ కంట్రోల్ పాత్రపై ప్రశ్నల వర్షం కురిపించింది. బ్యారేజీల సైట్ విజిట్ ఎన్ని రోజులకొకసారి చేసేవారని అధికారులను అడిగింది. రెండు మూడు నెలలకొకసారి అంటూ ఒకరు, అసలు సైట్ విజిట్ చేయలేదని మరొకరు సమాధానం ఇచ్చారు. అన్నారం డిజైన్ సరిగ్గా లేదని, వరదకు తగ్గట్టుగా డిజైన్ చేయలేదని ఈఈ



వెల్లడించారు. అంతకుముందు, తెలంగాణ ఇంజినీరింగ్ రీసెర్జ్ లేబొరేటరీకి చెందిన ఆరుగురు అధికారులను కమిషన్ విచారించింది. మూడు బ్యారేజీల కంటే ముందు మోడల్ స్టడీస్ కండక్ట్ చేశారా లేదా వంటి పలు అంశాలపై ప్రశ్నించింది. కానీ, జవాబులు దాటవేసే ధోరణితో ఉండడంతో కమిషన్ మండిపడుతోంది.ప్రభుత్వ ప్రాజెక్ట్ అనగానే, గవర్నమెంట్ ఆఫీసుల్లో ముందస్తు పనులు మొదలుపెడతారు. డిజైన్ల తయారీ, ఇంకా ఇతర పనులకు ప్రిపరేషన్స్ ఉంటాయి. కానీ, కాళేశ్వరం పనులు అలా కాదు. కాంట్రాక్ట్ సంస్థ మేఘా ఆఫీసులో డిజైన్ల తయారీ జరిగింది. ప్రభుత్వ అధికారులను ప్రలోభపెట్టి, భయపెట్టి తమవైపు తిప్పుకున్నారు. ఉద్యోగాలను సైతం పీకేస్తామని చెప్పి, అంతా తమకు అనుకూలంగా మార్చేశారు. దీనిని కరెక్ట్‌గా ఎగ్జిక్యూట్ చేసింది వెంకట రామారావు, శ్రీనివాస్ రెడ్డి. వీళ్లిద్దరూ మేఘా కంపెనీలో చాలా కీలకం. తమకున్న పరిచయాలతో ఇంజినీర్లు తమకు అనుకూలంగా పని చేసేలా ప్లానింగ్ అంతా పక్కాగా అమలు పరిచారు.గతంలో ఈఎన్సీగా పని చేసిన వెంకట రామారావు, రిటైర్డ్ అయిన తర్వాత నవయుగ కంపెనీలో పని చేశాడు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ఆ కంపెనీకి మేలు జరిగేలా టెండర్లను తయారు చేయించారనే అపవాదు ఉంది. తర్వాత కొన్నేళ్లకు నవయుగ నుంచి మేఘా కంపెనీలో జాయిన్ అయ్యాడు. భారీగా లబ్ధి చేకూర్చేలా అంచనాలను పెంచడంలో ఈయన దిట్ట. ఈయన చీఫ్ ఇంజనీర్‌గా ఉన్నప్పుడు పనిచేసిన వారు 80శాతం మంది తర్వాత ప్రధానమైన పోస్టుల్లో ఉండడంతో, వారందరిని నయానో, భయానో గుప్పిట్లో పెట్టుకుని, చెప్పింది చేసేలా పని కానిచ్చేశారు. డిజైన్లలో ఇష్టం వచ్చినట్టు మార్పులు చేయించారు. నూనె శ్రీధర్, వెంకటేశ్వర్లు, మురళీధర్ రావు, హరి రామ్, అనిత, శ్రీధర్ దేశ్‌పాండే, ఇలా చాలామంది ఈయన చెప్పింది చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే, కొందరు కిందిస్థాయి ఇంజినీర్లకు ఏం తెలియకుండానే కథంతా నడిపించారని అంటున్నారు. వెంకట రామారావును విచారిస్తే, కాంట్రాక్టుల లోగుట్టు అంతా బయటపడుతుంది.ప్రాజెక్టుల్లో రివైజ్డ్ ఎస్టిమేషన్ పెంచేశారు. సాధారణంగా ఆలస్యం వల్ల అంచనాలు పెరుగుతాయి. కానీ, కాళేశ్వరంలో మాత్రం టైమ్‌కే పని చేసినా అంచనాలు పెరగడం వెనుక అనేక అనుమానాలున్నాయి. దాదాపు 258 సార్లు అంచనాలు పెంచారని, ఘోష్ కమిషన్ వివరాలు రాబడుతోంది. కమిషన్ దూకుడుతో కొంతమంది అధికారులు ఉద్యోగం వదిలి వెళ్లేందుకు రెడీగా ఉన్నట్టు అధికార వర్గాల్లో తెగ మాట్లాడుకుంటున్నారు. తరతరాలు తిన్నా తరగని సొమ్మును వెనకేసుకున్నారని, అందుకే ముందే ఉద్యోగాన్ని వదిలేందుకు ప్రిపేర్ అయినట్టు భావిస్తున్నారు.

# శనిగరం చెరువును పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ఏక్‌దం న్యూస్, కోహెడ:**

మంత్రి పొన్నం ప్రభాకర్ కోహెడ మండలం శనిగరం చెరువును పరిశీలించారు. చెరువులో గంగమ్మ కి పసుపు కుంకుమ పూలు వేసి పూజలు చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామ ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గుట్ట నుండి వరద నీరు గ్రామంలోకి, హాస్టల్ లోకి వస్తుందని తెలిపారు. గుట్ట నుండి వచ్చే నీటిని ప్రోక్లెయిన్ ద్వారా డ్రెయిన్ సిస్టమ్ ద్వారా పంపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం బీసీ హాస్టల్ ను సందర్శించారు.



వారికి అందుతున్న ఆహారం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో బోర్ కావాలని, టాయిలెట్స్ ఇబ్బంది ఉందన్న సిబ్బంది వెంటనే అధికారులతో మాట్లాడి హాస్టల్ లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. తంగలపల్లి లో డబుల్ రోడ్డు పనులకు విద్యుత్ స్తంభాలు షిఫ్ట్ కోసం ఇప్పటికే 5 లక్షలు సాంక్షన్ చేసినప్పటికీ పనుల అలస్యంపై అధికారుల వివరణ కోరారు. పోల్స్ త్వరగా షిఫ్ట్ చేసి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.వాటితో మండలంలోని నారాయణపూర్ శ్రీరాములపల్లి, కోహెడ ల కి బిటి రోడ్లు మంజూరు అయ్యాయని గోట్లమిట్ట, నారాయణపూర్ మధ్య హైలెవల్ బ్రిడ్జి మంజూరు అయినట్టు గ్రామస్థులకు తెలిపారు.పల్లికాయ సబ్సిడీ రాలేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడారు.పర్యటనలో కొహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద ధర్మయ్య, ఇతర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎమ్మార్వో సురేఖ, ఎంపిడివో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలపై అప్రమత్తంగా వుండాలి

**–కష్టపడ్డవారికి ఖచ్చితంగా అవకాశాలు**

**–సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి**

**ఏక్‌దం న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం, లోక్ సభ సీట్లు గెలిచాం. మహేష్ కుమార్ గౌడ్ ను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కి ధన్యవాదాలు తెలుపుతు సీఎల్పీ ఏకగ్రీవ తీర్మానం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ భేటీలో అయన మాట్లాడారు. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలి. ప్రజల్లో ఉన్న వారికే జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వాలని పీసీసీకి సూచిస్తున్నా. పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసినందుకే వారికి పదవులు ఇచ్చాం. పార్టీ లో కష్టపడి పనిచేసిన వారికి ఖచ్చితంగా అవకాశాలు వస్తాయి. నరేంద్ర మోదీని ఓడించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉన్న సమయంలో పీసీసీ చీఫ్ గా మహేష్ గౌడ్ బాధ్యత చేపట్టారు. బీసీ కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన. రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామని అన్నారను. సుప్రీం కోర్టు తీర్పు ను పూర్తిగా అధ్యయనం చేసి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోడీ ప్రయత్నాలు చేస్తున్నాడు. నాలుగో సారి గెలవడం కోసమే ప్రధాని మోదీ జమిలీ ఎన్నికలు తీసుకువస్తున్నారు. జమిలీ ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి. తొమ్మిది నెలల్లో ఒక్క రోజు కూడా నేను సెలవు తీసుకోలేదు. ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం 27 రోజుల్లో 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదు. రైతు రుణ విముక్తి కావడమే ప్రభుత్వ లక్ష్యం. ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నం. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తాం. రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తాం. అధికారం కోల్పోయిన అసహనంలో ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోంది. ఇంచార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు జిల్లాల్లో పర్యటించాలి. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయని అన్నారు.




# విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

**–నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం**




**ఏక్‌దం న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ కళాశాలలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్యపర్చడంలోను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల కట్టలేనిది. సమాజంలో ఉన్నవారిని చైతన్యపర్చడంతో పాటు, సమాజ సేవను తమ సేవగా భావించే భావజాలం విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేసినట్లవుతుంది. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు.

జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్ ) భారత ప్రభుత్వం చేత 1969 సంవత్సరం ప్రారంభించబడిన యువజన కార్యక్రమం.ఈ పథకాన్ని ప్రారంభించి నేటికీ 56 సంవత్సరాలు.(సెప్టెంబర్ 24 2024), ఇక దీని చరిత్రలోకి పోతే డా. డి.ఎస్. కొఠారి (1964–66) నేతృత్వంలోని విద్యా కమిషన్, విద్య అన్ని దశలలో ఉన్న విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజిక సేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. ఏప్రిల్ 1967 సంవత్సరంలో రాష్ట్రాల విద్యాశాఖ మంత్రి వారి సమావేశంలో దీనిని పరిగణనలోకి తీసుకున్నారు. అయితే అప్పటికే విశ్వవిద్యాలయ దశలో, స్వచ్ఛంద ప్రాతిపదికన ఉనికిలో ఉన్న నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సి సి) లో చేరడానికి విద్యార్థులను అనుమతించాలని, దీనికి ప్రత్యామ్నాయాన్ని నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) అని పిలువబడే కొత్త కార్యక్రమం రూపంలో వారికి అందించవచ్చని వారు సిఫార్సు చేశారు. 1969 సంవత్సరంలో సెప్టెంబరులో జరిగిన వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ ఈ సిఫారసు ప్రకారంగా,సమస్యను వివరంగా పరిశీలించడానికి వైస్ చాన్సలర్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవచ్చని సూచించారు. భారత ప్రభుత్వ విద్యపై జాతీయ విధానం ప్రకటనలో, పని అనుభవం, జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించబడింది. మే, 1969 సంవత్సరంలో, విద్యా మంత్రిత్వ శాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా 'జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తివంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. పట్టణ విద్యార్థులను గ్రామీణ జీవితానికి పరిచయం చేయడానికి, తద్వారా దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయ సేవా పథకం తీసుకరావడం జరిగింది. 1969 సెప్టెంబరు 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వవిద్యాలయాలలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం,సహకారాన్ని అడిగిగారు.

విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించవలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధిలోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలుపంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం తెలియని నిర్మల మనస్కులు వీరు. వీరు కూడా సంఘజీవులే, సంఘంలో భాగస్వాములే, కాబట్టి సంఘసేవ (సోషల్ సర్వీస్) వాళ్ళకి బాధ్యత ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలున్నాయి.

ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. అదేవిధంగా మనం పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం వుండాలి– లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలి. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ.

విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే అవకాశాన్ని కల్పించడం ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవను ప్రోత్సహించేందుకు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం రెండు భాగాలుగా విభజించబడింది: సాధారణ కార్యకలాపాలు మరియు ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు. సాధారణ కార్యకలాపాలలో వారంవారీ సమావేశాలు, సమాజ సేవ, సామాజిక సేవా ప్రాజెక్టులు ఉంటాయి. ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు సాధారణంగా 7 రోజుల పాటు నిర్వహించబడతాయి, ఈ సమయంలో విద్యార్థులు శుభ్రపరచడం, మొక్కల పెంపకం మరియు ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల వంటి సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కళాశాలను పరిశుభ్రంగా వుంచటం– తోటలు పెంచటం– రోడ్లు వెయ్యటం. పరిసర గ్రామాలను దత్తత తీసుకొని ఆ గ్రామంలో రోడ్లు వేయటం, మురికి వాడలను శుభ్రపరచడం, నిరక్షరాస్యులకి విద్య బోధించడం. ఆరోగ్య సూత్రాలను, వయోజన విద్య ఆవశ్యకతను, జనాభా సమస్య నివారణను ప్రజలకు తెలియజేయడం. వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమదాలలోనూ సహాయం చేయడం. ధనవంతుల నుండి విరాళాలు సేకరించి బీదవారికి, అనాథలకు సహాయపడటం. పొదుపు ఆవశ్యకతను, అంటు వ్యాధుల వల్ల వచ్చే అరిష్టాలను అరికట్టే విధానాలను ప్రచారం చేయడం దీని ముఖ్య లక్షణం.

An evaluation version of novaPDF was used to create this PDF file.
Purchase a license to generate PDF files without this notice.

ఏక్ దం న్యూస్
సమగ్ర తెలుగు దినపత్రిక




# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



**–టిడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**

**– జిల్లా అడిషనల్ కలెక్టర్ కు వినతి**

**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**
కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే తిరుపతి, కే బాపూరావు లు డిమాండ్ చేశారు. సోమవారం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో, చానలల్లో రిపోర్టర్లుగా ఉంటూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారన్నారు. అందులో చాలామంది పేదరికంతో ఉన్న కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని, కనీసం సొంత ఇల్లు లేక కిరాయి ఇళ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులతో జర్నలిస్టులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సొంత ఇల్లు లేని జర్నలిస్టులకు అద్దె చెల్లించడం భారంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని, నివేసిన స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి వెంటనే నివేశణ స్థలాలు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ రాజు, చట్ల శంకర్, వేంసాని వెంకటరమణ, లావణ్య, దొడ్డ రాజేంద్రప్రసాద్, ఖాజాఖాన్, లక్కం సురేష్, రమేష్, విజయ్ కుమార్, సుదర్శన్ రెడ్డి, రవీందర్, నీల రాజు, కొమ్ము గణేష్, శంకర్ రెడ్డి, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రిలో ఆర్థిక దోపిడీలను అరికట్టండి



**–డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి**

**ఏక్‌దం న్యూస్, కరీంనగర్:**
ప్రైవేట్ ఆస్పత్రిలో వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా, వివిధ రకాల సర్జరీ ల కొరకు వస్తున్న రోగుల దగ్గర ధరల పట్టికల కంటే అదనంగా ఆర్థిక దోపిడీలు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులను గుర్తించి తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి కోరారు.
స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో గౌరవ కలెక్టర్ పమేలసత్పత్తి గారికి డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్ తిరుపతి సహాయ కార్యదర్శి రఘుపతి తో కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్ తిరుపతి మాట్లాడుతూ జిల్లాల్లో ప్రవేట్ హాస్పటల్లో ఆర్థిక దోపిడీలను అరికట్టడంలో జిల్లా వైద్య అధికారులు విఫలం అయ్యారని వారు అన్నారు. జిల్లాల్లో బ్రుణ హత్యలు జరుగుతున్న కాని నిజనిర్ధారణ కమిటీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రోజుకు భృణహత్యల సంఖ్యలు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
సూపర్ స్పెషాలిటీ మల్టీస్ స్పెషాలిటీ సంతన సాఫల్య కేంద్రాలు వివిధ రకాల తోక పేర్లు పెట్టుకొని ఆస్పత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది లేకుండానే వివిధ కన్సల్టేషన్ డాక్టర్ల పేర్లు పెట్టి లక్షలలో ఆర్థిక దోపిడీ చేస్తున్నా గానీ వైద్యాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వివరిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రాన్ని చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. హాస్పటల్లో ధరల పట్టికలో ఏర్పాటు చేసే విధంగా వైద్యాధికారులు తనిఖీలు చేయాలని వారు అన్నారు. అర్హులు లేని వారు ఆస్పత్రిలో నెలకొల్పి కేవలం 500 రూపాయలు కన్సల్టేషన్ ఫీజులు చెల్లించి లక్షలలో వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఆస్పత్రిలో వచ్చే రోగులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా కనీసం పార్కింగ్ స్థలాలు త్రాగే నీరు కూసోడానికూర్చులు ఇవి ఏమాత్రం పట్టించుకోకుండా ఆసుపత్రి వ్యాజమాన్యం వ్యాపార దృక్పథంతో హాస్పిటల్ నడిపిస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా నిజనిర్ధారణ కమిటీలను ఏర్పాటు చేసి ఫైర్ సేఫ్టీ పొల్యూషన్ అనుమతి లేని హాస్పటల్ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న హాస్పటల్ పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# దాతల సహాయంతో ఆర్థిక సహాయం



## –మానవత్వాన్ని చాటిన మారుపాక అనిల్

**ఏక్‌దం న్యూస్, ఇల్లంతకుంట:**
రాజన్న సిరిసిల్ల ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ స్థానికంగా బీసీ హాస్టల్‌లో ఉంటున్న రోహిత్ ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై హస్పిటల్ లో చికిత్స చికిత్స పొందుతున్నారు. ఇతని వైద్య ఖర్చులకోసం డాక్టర్లు నాలుగు లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయమై తెలిసిన వెంటనే స్పందించిన ఇల్లంతకుంట మన తెలంగాణ రిపోర్టర్ వివిధ మాధ్యమాల ద్వారా దాతల సహాయంతో జమ చేసిన ఆర్థిక సహాయాన్ని విద్యార్థి తల్లి సుశీల(రజిత) కు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ అని నమ్ముతానని ఎవరికి ఎప్పుడు ఎలాంటి ఆపద వస్తుందో తెలియదని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు, సామాజిక మాద్యమాల ద్వారా స్పందిచిన దాతలు రూ.59000 వేల రూపాయలను సహాయం అందిచండం జరిగింది అని ఆయన తెలిపారు, ఈ ఆర్థిక మొత్తం గాలిపెల్లి హైస్కల్ హెచ్ ఎం పావని, ఉపాధ్యాయులు అయ్యన్నగారి, హరికృష్ణ రెడ్డి, తుంకుంట నరేందర్ రెడ్డి, వార్డెన్ గంగయ్య సమక్షంలో అమౌంట్ ను అందివ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా దాతలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి కుంటుంబ సభ్యులు.

# సమ్మిరెడ్డికి ఘన నివాళులు

**–సమ్మిరెడ్డి చిత్రపటానికి పూలమలు వేసిన టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు.**

**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**
జమ్మికుంట మాజీ వ్యవసాయం మార్కెట్ చైర్మెన్ , దివంగత ఎమ్మెస్సార్ ప్రియ శిష్యుడు స్వర్గీయ సమ్మిరెడ్డి దినకర్మ జమ్మికుంట లోని ప్రముఖ ఫంక్షన్ హాల్ లో కుటుంబసభ్యుల మరియు పలు రాజకీయ నాయకుల మధ్య నిర్వహించారు కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు పాల్గొని సమిరెడ్డి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, దర్యాన్ని అందించారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన సమ్మె రెడ్డి సంతాపసభ లో మేనేని రోహిత్ రావు మాట్లాడుతూ, సమ్మిరెడ్డి రాజకీయ ప్రయాణం ఎంతోమందికి ఆదర్శమని, ఒక్కో మెట్టు ఎక్కి జమ్మికుంటలో మొదలైన ఆయన



రాజకీయ ప్రస్థానం రాష్ట్ర రాజకీయాల్లోనే కీలకపాత్ర వహించే దిశగా కొనసాగిందని, ఎమ్మెస్సార్ ప్రియ శిష్యుడుగా సమ్మి రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని, సమ్మి రెడ్డి మరణం వ్యక్తిగతంగా ఎమ్మెస్సార్ కుటుంబానికి తీరని లోటని తెలియజేసారు.

# 1990-91 ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**
1990–91 విద్యా సంవత్సరంలో కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థిని విద్యార్థులు 34 సంవత్సరాల తరువాత కొత్తపల్లి పట్టణంలోని ఓ స్థానిక ప్రవేటు ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హాజరయినా అందరి సమక్షంలో



జరుపుకున్నారు,ఈయొక్క కార్యక్రమంలో హాజరయినా పూర్వ విద్యార్థిని విద్యార్థులు ఇప్పుడు వారు చేస్తున్న ఉద్యోగలను, వ్యాపారాలను ఒకరోజు వదిలి వారి వయస్సును కూడా మరచి అందరూ తమ ఆట పాటలతో చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు, చాలా సంవత్సరాలకు ఒకరినొకరు కలుసుకోవడంతో ఆనందాలను పంచుకున్నారు, కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంను ప్రారంభించారు, మరణించిన కొందరి స్నేహితులకు ఆత్మశాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు, తదానంతరం హాజరయినా విద్యార్థులకు ప్రతి ఒక్కరికి సన్మానం చేశారు, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేసుకుంటామని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు, నిరుపేదలకు ఎంతోమందికి ఆర్థిక



సహాయం చేశామని ఇకముందు కూడా వీలయితే చేస్తామని 1990–91పదవతరగతి విద్యార్థిని విద్యార్థులు తెలిపారు

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

**–ఏఐఎఫ్డిఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్**

**–7000 కోట్లు వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి**

**ఏక్‌దం న్యూస్, కరీంనగర్:**
కరీంనగర్ కలెక్టర్ కి వినతి పత్రం అందించారు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ 7000 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని ఏఐ ఎఫ్ డీఎస్ ఉమ్మడి జిల్లా



ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్ అన్నారు, ప్రభుత్వ పాఠశాల సాంఘిక సంక్షేమ హాస్టల్ ఆహార పదార్థాలు కల్తీ ద్వారా ఫుడ్ పాయిజన్లు అవుతున్నాయి అన్ని వసతులు కల్పించాలని గురుకుల పాఠశాలలు తక్షణమే అద్దె భవనాలు కాకుండా ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వ యూనివర్సిటీ బలోపేతం చేయాలని ప్రభుత్వం ప్రజలకు ఉచిత పథకాలు కాకుండా ఉచిత విద్య ఉచిత వైద్యం అందజేయాలని ప్రవేట్ స్కూల్ ల పైన ఫీజులు నియంత్రణ చట్టాలు అమలు చేయాలని అధిక ఫీజులు తీసుకుంటున్న ప్రవేట్ పై స్కూల్ కఠినంగా చర్యలు తీసుకోవాలని గడ్డం శ్రీకాంత్ అన్నారు ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు అభిరామ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డు కల్తీ అపచారంలో బీజేపీకి భాగస్వామ్యం ఉన్నట్టేనా..?



**–కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలి..**

**– టీటీడీ లడ్డు కల్తీ దురదృష్టకరం..**

**–ఈ ఘటనపై విచారణ జరిపి నిగ్గు తేల్చాలి..**
**–బాధ్యులను కఠినంగా శిక్షించాలి..**

**–పునరావృతం కాకుండా**

**–పకడ్బందీ చర్యలు తీసుకోవాలి..**

**–కేంద్రంపై బండి సంజయ్ ఒత్తిడి తీసుకురావాలి..**

**–కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు డిమాండ్**

**ఏక్‌దం న్యూస్, కరీంనగర్:**
తిరుమల తిరుపతిలో లడ్డు కల్తీ జరగడం అత్యంత దురదృష్టకర మని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమలలో లడ్డు కల్తీ కావడం, దీనికి సంబంధించిన అపచారంలో బిజెపికి భాగస్వామ్యం ఉన్నట్టేనా అన్న అనుమానాలు ప్రజల్లో తలెత్తుతున్నాయని ఆరోపించారు.
సోమవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అత్యంత పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు కల్తీ వ్యవహారం జరగడం దుర్మార్గమైన చర్యగా దుయ్యబట్టారు. గతంలో టిటిడి పాలకమండలి సభ్యులుగా 24 మందిని, ప్రత్యేక ఆహ్వానితులుగా 52 మందిని, నలుగురిని ఎక్స్ ఆఫీసియో మెంబర్లుగా నియమించారని చెప్పారు. ఇందులో ఎక్కువ శాతం కేంద్ర మంత్రులు, బిజెపి ముఖ్య మంత్రులు, బిజెపి నేతలు సిఫార్సు చేసిన వారిని నియమించారని ఆరోపించారు. లడ్డు తయారీకి ఉపయోగించే నెయ్యి, ఇతర సరుకుల కొనుగోలు ప్రక్రియ బోర్డు సభ్యులు పర్యవేక్షిస్తుంటారని, వారికి దానిపై పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. పర్యవేక్షణ లేకుండా కల్తీ వస్తువులతో లడ్డులు తయారు చేయడం దారుణమని పేర్కొన్నారు. టిటిడి బోర్డు మెంబర్లకు తెలియకుండా లడ్డు కల్తీ ఎలా జరిగిందో, దీనికి కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైఎస్ఆర్సిపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో అంటగాగిన విషయం ప్రజలందరికీ తెలుసు అని పేర్కొన్నారు.
ఈ వ్యవహారంలో గత వైఎస్ఆర్సిపీ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఉందని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. టీటీడీ పాలకమండలిలో బిజెపి వాళ్లే ఎక్కువ శాతం ఉన్నారని, నెయ్యి, ఇతర సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన నిర్ణయాల్లో వీరిదే కీలక పాత్ర ఉంటుందని ఆరోపించారు. లడ్డు తయారీలో ఏమేం వాడుతున్నారో.. నాణ్యతగా తయారు చేస్తున్నారా.. లేదా.. పర్యవేక్షించాల్సిన బాధ్యత టిటిడి బోర్డు మెంబర్లకు ప్రధానంగా ఉంటుందని పేర్కొన్నారు. కనీసం దానిపై దృష్టి పెట్టకపోవడం అత్యంత దురదృష్టకరమని చెప్పారు. లడ్డు కల్తీ సంబంధించిన అపచారానికి బిజెపి పెద్దలు, కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా.. అని ప్రశ్నించారు. లడ్డూల తయారీలో నాణ్యత ప్రమాణంలో పాటు చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సింది ఉంటుందని పేర్కొన్నారు. ఆ సోయి అప్పటి అప్పటి వైఎస్ఆర్సిపీ ప్రభుత్వం, బిజెపి పెద్దలకు లేకపోవడం వల్లే ఇలాంటి వ్యవహారం బయటకు వచ్చిందని తెలిపారు. భక్తుల ప్రజల మనోభావాలతో బిజెపి వాళ్లు ఆటలాడుకోవడం ఇకనైనా మానుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ లడ్డు కల్తీపై స్టేట్మెంట్లు ఇవ్వడం కాకుండా, ఈ వ్యవహారంపై విచారణ త్వరగా జరిపించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఆ సమయంలో బిజెపి తరఫున టీటీడీ పాలకవర్గ సభ్యులుగా వ్యవహరించిన వారిని పార్టీ నుంచి బహిష్కరించే బాధ్యత బండి సంజయ్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లడ్డు కల్తీ వ్యవహారంలో వారి నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుందని ఆరోపించారు. బండి సంజయ్ బిజెపి అధిష్టానంతో ఇలా చేయించే దమ్ము.. ఉందా అని ప్రశ్నించారు. దోషులను కఠినంగా శిక్షించేలా చూడాలని సూచించారు. లడ్డు కల్తి వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే నిజా నిజాలు నిగ్గు తేల్చేందుకు కేంద్ర స్థాయిలో విచారణ జరిపేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి దోషులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.
మహా ప్రసాదంగా భావించే తిరుమల లడ్డూనూ చివరకు కల్తీ చేయడం నీచమైన చర్య అని మండిపడ్డారు. దేశంలోని ప్రముఖ ఆలయాల్లో ప్రముఖ ఆలయాల్లో లడ్డూలు, ప్రసాదం తయారీలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ఘటన జరిగిన తర్వాత బాధపడడం కాకుండా, ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల మనోభావాలకు సంబంధించిన సున్నితమైన అంశాల్లో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని వెలిచాల రాజేందర్ రావు సూచించారు. తిరుమలలో లడ్డు కల్తీ లాంటి ఘటనలు ఇకముందు రాబోయే రోజుల్లో జరగకుండా కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

An evaluation version of novaPDF was used to create this PDF file.
Purchase a license to generate PDF files without this notice.